క్లుప్తంగా

వైభవంగా జగన్నాథ రథయాత్ర



లక్కవరపుకోటలో జగన్నాథ స్వామి ఊరేగింపు

లక్కవరపుకోట: మండల కేంద్రంలో జగన్నాథ స్వామి రథయాత్రను మంగళవారం వైభవంగా నిర్వహించారు. పూరీలో జరిగే యాత్రను అనుసరించి ఇక్కడ కూడా రథ యాత్ర నిర్వహించడం విశేషం. ప్రత్యేక చెక్కతో తయారు చేసిన జగన్నాథుడు, బల భద్రుడు, సుభద్రాదేవి విగ్రహాలను గ్రామం లోని రామాలయం వద్ద నుంచి మేళతాళా లతో ప్రత్యేక వాహనంలో ఊరేగించారు.

ఆషాడమాస పూజలు



పూజలందుకుంటున్న రాజరాజేశ్వరీదేవి

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజే శ్వరీదేవి అమ్మవారి ఆలయంలో ఆషాడ మాసోత్సవ పూజలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చ కులు దూసి శ్రీధర్ శర్మ అమ్మవారిని ప్రత్యేకం గా అలంకరించారు. భక్తులతో విశేష పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎం.వి.ఎస్.ఎన్.రాజు దంపతులు

చీపురుపల్లి: స్థానిక బాపూజీ ఆశ్రమంలో వృద్ధులకు పట్టణానికి చెందిన విశ్రాంత జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు ఎం.వి.ఎస్.ఎన్. రాజు దంపతులు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. రాజు దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వృద్ధులకు దుస్తులు అందజేయడంతో పాటు భోజన ఏర్పాట్లు చేశారు. అనంతరం అయిదుగురు వేదపండితులకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు కోట్ల లక్ష్మణ రావు పాల్గొన్నారు.

బాధితురాలికి సహాయం



బాధితురాలికి బియ్యం బస్తాలు అందజేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట గ్రామం లో గేదెల పావని టీదుకాణం సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమై, సామగ్రి పూర్తిగా కాలిబూడిదయ్యింది. బాధితురాలిని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, ఎంపీటీసీ టి.వి. రమణ, ఉపసర్పంచ్ వంటాకు శ్రీనివాసరావు, నాయకులు సత్యనారాయణ తదితరులు మంగళవారం పరామర్శించారు. బాధితురాలికి రెండు బస్తాల బియ్యం అందజేశారు.

విద్యార్థులందరికీ విద్యాకానుక అందాలి



మాట్లాడుతున్న ఎంఈఓ-2 చక్రధర్

గజపతినగరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో 1 నుంచి 10 వతరగతి వరకు చదువుతున్న ప్రతి ఒక్కరికీ జగనన్న విద్యాకానుక అందించాలని హెచ్ఎంలకు ఎంఈఓ-2 బలివాడ సాయిచక్రధర్ ఆదేశించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో మండలంలోని హెచ్ఎంలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాకానుక అందుకున్న పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులతో బయోమెట్రిక్ వేయించాలని ఆదేశించారు. ఎంఈఓ విమలమ్మ, సీఆర్పీలు రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ తెలిపారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఏ (పాలిటిక్స్, హిస్టరీ)లో 60 సీట్లు, బీకాం (కామర్స్, కంప్యూటర్ అప్లి కేషన్)లో 60 సీట్లు, బీఎస్సీ(మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ)లో 40, బీఎస్సీ(బోటనీ, జువాలజీ)లో 40 సీట్లు చొప్పున ఉన్నాయని చెప్పారు. అర్హత ఉన్న విద్యార్థులు ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. కళాశాలలో పూర్తిస్థాయిలో సదుపాయాలతో పాటు అధ్యాపకులు ఉన్నారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని చెప్పారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే గడప గడపకు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి



లక్కవరపుకోట: ఖాసాపేటలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

లక్కవరపుకోట: క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలు తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపడమే ముఖ్య ఉద్దేశంగా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్న ట్టు ఎస్.కోట ఎమ్మెల్యే కడు బండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఖాసాపేట గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' మంగళవారం నిర్వ హించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి కుటుంబా నికీ వివిధ సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించడంతో పాటు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను త్వరగా పరిష్కరించాలని సచివాల య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సమ ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో గుర్తించిన, తమ దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతీ సచివాలయానికి రూ. 20 లక్షలు మంజూరు చేస్తోందని తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఖాతాల్లో ఈ నాలుగేళ్ల పాలనలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో సుమారు రూ.230 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఎన్నికలు సమీపి స్తుండడంతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బూటకపు హామీలు గుప్పిస్తున్నాడని, సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలనే కాపీ కొట్టి మరింతగా అమలు చేస్తానని చెప్పడం పులిని చూసి నక్క వాత లు పెట్టుకున్న తీరులా ఉందని విమర్శిం చారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోళ్ల కృష్ణ, కొటాన ఈశ్వరరావు, చొక్కాకుల వెంకటరావు, చలుమూరి మాధవరావు, జగ్గన్నదొర, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమం

గుర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, గ్రామాలు అభివృద్ధి పదంలో నడుస్తున్నాయని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. కొండగండ్రేడులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలు సుకున్నారు. నాయకులు బెల్లాన బంగారు నాయుడు, సర్పంచ్ సారిక గోవింద్, ఎంపీటీసీ రామారావు, కెంగువ మధుసూదనరావు, ఈఓపీఆర్డీ గాయత్రీ, ఆర్ఐ అప్పలరాజు పాల్గొన్నారు.



గుర్ల: కొండగండ్రేడులో పథకాలను వివరిస్తున్న నాయకులు

పాలనలో తేడాను గుర్తించండి

చీపురుపల్లిరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు ఇంటి వద్దే అందుతున్నాయని, గత టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ సానుభూతి పరులు, జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చిన వారికే పథకాలు అందేవని ఎంపీపీ ఇప్పిలి వెంకటన రసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. పరిపాలనలో గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాలను బేరీజు వేసుకోవాలని ప్రజల కు వారు సూచించారు. కర్లాం గ్రామంలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, తహసీల్దార్ ఎం.సురేష్, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, స్థానిక సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, నాయకులు బాణాన శ్రీనివాసరావు, బాణాన రమణ, కర్లాం పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లిరూరల్: కర్లాంలో లబ్ధిదారులకు సీఎం జగన్ సందేశ పత్రాన్ని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు

ప్రభుత్వ బడిలో చేర్పించండి



ఉపాధి పనుల వద్ద తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం పద్మ

చీపురుపల్లి: అన్ని సదుపాయాలతో పాటు ప్రైవేటు స్కూళ్లకు దీటుగా బోధన అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని మండలంలోని రామలింగాపురం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం గొర్లె పద్మ తల్లిదండ్రులను కోరారు. రామలింగాపురంలో పొలం పనులు, ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశాల్లో సహోపాధ్యాయులు మురళి, లక్ష్మీనారాయణ, రఘురామ య్యతో కలిసి మంగళవారం ప్రచారం నిర్వహించారు. పెద్దలు, తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని కోరారు. పాఠశాలలో విద్యార్థులకు 'జగనన్న గోరు ముద్ద' పథకంలో భాగంగా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నామని, విద్యాకానుకలో భాగంగా యూనిఫాం, నోట్ పుస్తకాలు, బ్యాగ్, షూస్, బెల్టుల పంపిణీ, అమ్మ ఒడి పథకంలో భాగంగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తున్న విషయాన్ని వివరించారు. తల్లిదండ్రులు అంతా ఆలోచన చేసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే చేర్పించాలని అభ్యర్థించారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి



జామి: మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సూర్యనారాయణ



వేపాడ: లెప్రసీ సర్వేపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ధరణి

జామి: కుష్టు వ్యాధి నిర్మూలను ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎస్.సూర్యనారాయణ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో కుష్టు వ్యాధి నిర్మూలన సర్వేపై సిబ్బందికి మంగళవారం అవగాహన క ల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి వచ్చెనెల 16వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. అలాగే లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని, వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించాలని సూచించారు. బీపీహెచ్ఎన్ ఎం.సత్య, జామి పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్య రేఖ, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్‌ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిద్దాం..అపోహలను తొలగిద్దాం

వేపాడ: ప్రజలకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించి, వారి అపోహలను తొలగించాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిపై ఉందని వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.ధరణి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లెప్రసీ వ్యాధి గ్రస్తుల గుర్తింపుపై ఈ నెల 26 నుంచి వచ్చేనెల 16వరకు ఇంటింట సర్వే చేయాలని చెప్పారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని పీహెచ్‌సీలకు తీసుకువచ్చి రోగనిర్ధారణ చేయాలని సూచించారు.సీహెచ్ఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

విధుల్లో కార్యదర్శి అలక్ష్యం



మాట్లాడుతున్న ఇంగిలాపల్లి సర్పంచ్ గర్భాపు విజయలక్ష్మి

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి సచివాలయ ఇన్‌చార్జి కార్యదర్శి వెంకటరావు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్పంచ్ గర్భాపు విజయలక్ష్మి ఆరోపించారు. సచివాలయం వద్ద మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఈ నెల 8, 10, 12వ తేదీల్లో మృతిచెందారని, వారి కుటుంబ సభ్యులు మరణ ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేసినా జారీ చేయలేదన్నారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇన్‌చార్జి కావడం వల్లే పనులు సకాలంలో పూర్తికావడంలేదని, సచివాలయానికి పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించాలని కోరారు. మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం అంశాన్ని కార్యదర్శి వెంకటరావు వద్ద ప్రస్తావించగా.. సర్వర్ పనిచేయకపోవడంతో జాప్యం జరిగిందని, రెండురోజుల్లో ధ్రువపత్రాలు జారీ చేస్తామని చెప్పారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

గుర్ల: రైతుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) వద్ద రైతులకు రాయితీపై వరి విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులను గ్రామాల్లోనే ఆర్బీకేల ద్వారా సరఫరా చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన బంగారునాయుడు, ఇజ్జిరోతు ప్రసాద్, సీతారామ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, తదితరులు

కనీస పెన్షన్ రూ.9వేలు అందించాలి



ప్రధానమంత్రికి పోస్టుకార్డులను పోస్టు చేస్తున్న పెన్షనర్లు

కొత్తవలస: ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) పెన్షన్‌దారులకు కనీసం రూ.9 వేల పింఛన్ అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. నాయకుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యలను వివరిస్తూ భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి చేరేలా స్థానిక ప్రధాన పోస్టాఫీస్ నుంచి మంగళవారం పోస్టుకార్డులను పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత మెడికల్ సౌకర్యం కల్పించాలని, బస్సు,రైళ్ల ప్రయాణాలకు 50 శాతం రాయితీ కల్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: గొట్లాం ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫ రాకు అంతరాయం కలగనున్నట్లు బొండపల్లి విద్యుత్ శాఖ ఏఈఈ ఆర్.శంకరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లు సరి చేయడం, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గొట్లాం, అయ్య న్నఅగ్రహారం, జియ్యన్నవలస, రెడ్డిపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాల ని కోరారు.

బాలికల కళాశాలలో డీఈఓ తనిఖీలు



కళాశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాల ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం తనిఖీలు చేశారు. కళాశాలలో అడ్మిషన్లపై అధ్యాపకులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఏకైక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ప్రభుత్వం ధర్మవరానికి కేటాయించిందని చెప్పారు. అమ్మాయిలు సుదూర ప్రాంతాలకు వెళ్లే బదులు ఎస్.కోటకు కూతవేటు దూరంలో ఉన్న ఈ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను అభినందించారు.

స్కూల్ ప్రహరీపై ఒరిగిన విద్యుత్ స్తంభం

మెరకముడిదాం: గర్భాం మోడల్‌స్కూల్ ప్రహరీపైకి 33 కేవీ విద్యుత్ స్తంభం మంగళవారం ఒరిగిపోయింది. ఎలాంటి ప్రమాదం జరగలేదు. వైర్లు కిందకు వేలాడుతుండడంతో మోడల్‌స్కూల్ సిబ్బంది, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.ఈవిషయాన్ని విద్యుత్‌శాఖాధికారులకు తెలియజేసినప్పటికీ వారు పట్టించుకోలేదు. ఏపీఈపీడీసీఎల్ అధికారులు స్పందించి వెంటనే ఒరిగిపోయిన స్తంభాన్ని తీగలను సరిచేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.



మోడల్‌స్కూల్ ప్రహరీపైకి ఒరిగిన విద్యుత్ స్తంభం

యోగా సాధనతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న శిక్షకురాలు గవిడి సుజాత

చీపురుపల్లి: ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ యోగా చేయాలని శ్రీ చైతన్య యోగా సంస్థ శిక్షకురాలు గవిడి సుజాత తెలిపారు. అంతర్జాతీయ యోగా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పట్టణంలోని శ్రీ చైతన్య యోగా కేంద్రంలో ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా భారతదేశ సంపదగా గుర్తించబడిందని, ప్రపంచ దేశాలు అనుకరిస్తున్నాయని చెప్పారు. ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అప్రమత్తంగా ఉండాలి

చీపురుపల్లిరూరల్(గరివిడి): సైబర్ నేరాలు రోజురోజుకీ పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని చీపురుపల్లి సీఐ టి.సంజీవరావు సూచించారు. చీపురుపల్లి-గరివిడి ప్రధాన రహదారిలో గరివిడి ఎస్ఐ దామోదరరావుతో కలిసి మంగళవారం వాహన తనిఖీలు చేశారు. అనంతరం ప్రయాణికులు, ప్రజలకు సైబర్ నేరాల నుంచి ఎలా జాగ్రత్తగా ఉండాలో వివరించారు. స్మార్ట్ ఫోన్ ఉన్న వారంతా దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న పప్పుల చీటీల వల్ల ఎంతో మంది ఆర్థికంగా నష్టపోతున్నారని, ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని చెప్పారు.

దత్తిరాజేరు ఎంఈఓ-2గా సుధాకర్

దత్తిరాజేరు: మండల విద్యాశాఖ అధికారి-2గా ఎర్రాపు సుధాకర్ మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు సచివాలయ ఆవరణలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవా రం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కంటి పరీక్షలు చేసి అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. చుట్టుపక్క గ్రామాల వారు ఈ శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

బొండపల్లి: త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథంపై ప్రబోధ సేవా సమితి సభ్యులు మండలంలోని గరుడబిల్లి,వేంద్రాం,రాచకిండాం, కొండ కిండాం తదితర గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భగవద్గీతలో సర్వ మానవాళికి సంబంధించిన జ్ఞానం ఉందన్నారు. ఈ గ్రంథాన్ని చదివి ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలని తెలిపారు. విజయనగరం ప్రబోధ సేవా సమితి అధ్యక్షులు శంకరరావు, ప్రసాద్, రాజప్పడు, దుర్గారావు,సూరిబాబు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల యోగా శిబిరం

కొత్తవలస: విజయనగరం జిల్లా కేంద్రంలో తోటపాలెం వద్ద ఉన్న సాయిబాలాజీ ఫంక్షన్ హాల్లో కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామానికి చెందిన గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దివ్యాంగుల యోగా శిబిరం బుధవారం నిర్వహించనున్నట్టు ఆ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా రెండు వేల మంది దివ్యాంగులతో యోగా శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, జిల్లా జడ్జి బి.కళ్యాణ్‌చక్రవర్తి పాల్గొంటారని తెలిపారు. అలాగే అదే ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వివరించారు.

రజకుల ధర్నా

శృంగవరపుకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పట్టణంలోని రజకులు మంగళవారం ధర్నా చేశారు. రజకులు మాట్లాడుతూ పుణ్యగిరి రోడ్డులో పూర్వం నుంచి పుణ్యగిరి గెడ్డలో వస్తున్న నీటి ఆధారంగా ఊట గెడ్డల పక్కన బావులు ఏర్పాటు చేసుకుని బట్టలు ఉతుకుతూ వృత్తిని కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పుడు కొందరు కబ్జాదారులు గెడ్డను ఆక్రమించి బల్లలు తీసేసి, బావులు కూల్చేసి, వృత్తి పని లేకుండా, తమ జీవనాధారం లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో శివాలయం ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వ హించారు. అర్చకులు మణికంఠ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు చేశారు.ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు, సర్పంచ్ రొంగలి రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపులేని స్కూళ్లను సీజ్ చేయాలి

శృంగవరపుకోట: ప్రభుత్వ గుర్తింపులేని పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలను సీజ్ చేయాలంటూ ఎస్ఎఫ్ఐ ఎస్.కోట మండల కమిటీ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష మాట్లాడుతూ విద్యాహక్కుచట్టాన్ని తుంగలోకి తొక్కి ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫాం అధిక రేట్లకు విక్రయించి వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. పట్టణంలో రిజిస్ట్రేషన్ లేకుండా ఓ ప్రైవేటు ఇంట్లో బహిరంగంగా పుస్తకాలు అమ్ముతున్నారన్నారు. దీనిపై ఎంఈఓ సత్యనారాయణను ప్రశ్నిస్తే కుంటిసాకులు చెబుతున్నా రన్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేశారు.

ఉపాధి పనుల పరిశీలన

వేపాడ: దబ్బిరాజుపేటలో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ మంగళవారం పరిశీలించారు. వేతనదారులకు పలుసూచనలు చేశారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి 'జగనన్న సురక్ష'కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

పాఠశాల అప్- గ్రేడేషన్ విద్యార్థులకు వరం



ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని బొండపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ప్రభుత్వం హైస్కూల్‌గా అప్-గ్రేడేషన్ చేయడం ఈ ప్రాంత విద్యార్థులకు వరమని జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు అన్నా రు. హైస్కూల్‌గా అప్-గ్రేడేషన్ బొండపల్లి పాఠశాలను మంగళవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హైస్కూల్ లేకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు పడుతున్న ఇబ్బంది లను స్థానిక నాయకులు,పెద్దలతో కలిసి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ద్వారా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మంత్రి బొత్స ఇచ్చిన మాటప్రకారం పాఠశాలను హైస్కూల్‌గా అప్ గ్రేడ్ చేయించారని చెప్పారు.స్థానిక సర్పంచ్ సాకేటి స్వప్న, ఎంపీటీసీ లోచర్ల రాములప్పమ్మ, ఎంఈఓ పి.రామారావు, హెచ్ఎం బి.జ్యోతి,పూజారి గోపి, వైస్ సర్పంచ్ అప్పలరెడ్డి,మాజీ ఎంపీటీసీ మీసాల వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పాలనపై ప్రచారం

చీపురుపల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పరిపాలనపై విస్తృత ప్రచారం చేయనున్నట్టు బీజేపీ జిల్లా ఇన్‌చార్జి వి.వి.రామరాజు చెప్పారు. ప్రచార కార్యక్రమాన్ని పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ నెల 22న విజయనగరంలోని కోట జంక్షన్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ పార్టీ విజయనగరం పార్లమెంట్ కన్వీనర్ గద్దె బాబూరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తీగల హరనాద్, విజయనగరం అసెంబ్లీ కన్వీనర్ బొబ్బిలి శ్రీను, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెపురి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

శృంగవరపుకోట: స్థానిక ఆకులడిపో వద్ద ఉన్న మద్యం దుకాణం నుంచి ఓ వ్యక్తి మంగళవారం అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టణానికి చెందిన వలంటీర్లు మామిడి యోగేష్, వాకాడ కార్తీక్ గుర్తించారు. ఈ విషయాన్ని మహిళా పోలీస్ మోనికాకు వలంటీర్లు ఫోన్‌లో తెలియజేశారు. మద్యాన్ని పట్టుకుని తర్వాత ఫిర్యాదు చేయమని వలంటీర్లకు ఆమె చెప్పడంతో వారు బైక్‌పై మద్యం తరలిస్తున్న వ్యక్తిని వెంబడించారు. సదరు వ్యక్తి మార్గం మధ్యలో మద్యం సీసాల సంచిని విడిచి పారిపోయాడు. దీంతో వలంటీర్లు మద్యం సీసాలను తీసుకొచ్చి మహిళా పోలీస్, ఎస్.ఐ తారకేశ్వరరావుకు అప్పగించారు.